వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 296 శనివారం | 08 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# మీడియా దిగ్గజం రామోజీ కన్నుమూత

రేపు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

సంతాపం తెలిపిన ప్రెస్ క్లబ్, వరంగల్ వాయిస్ యాజమాన్యం

8 లో..



వివరాలు 2లో..





# బల్దియా భవనం.. శంకుస్థాపనకే పరిమితం

గుంతలు తీసి.. నిర్మాణం మరిచిన పాలకులు

రెండేళ్లుగా ముందుకు సాగని పనులు

ప్రమాద కరంగా మారిన గుంత

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండో అతి పెద్ద నగరంగా విస్తరిస్తున్న ఓరుగల్లులో అభివృద్ధి అటకెక్కింది. వరంగల్ మహా నగరపాలక సంస్థ కొత్త పరిపాలన భవన నిర్మాణానికే అతీగతీలేని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ జీహెచ్ ఎంసీ భవనం మాదిరిగానే జీడబ్ల్యూఎంసీ కార్యాలయ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.20.50 కోట్లు కేటాయించినా భవన నిర్మాణం అటకెక్కింది. రెండు సంవత్సరాలక్రితం అప్పటి పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అట్టహాసంగా శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగడం లేదు. వచ్చే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఐదు అంతస్తుల్లో భవనం నిర్మించేందుకు డిజైన్ చేసినా పనుల్లో పురోగతి లేదు. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి సంవత్సరంలో భవన నిర్మాణం పూర్తి చేయాలంటూ ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు గుంతలు తీయడం తప్ప పనులు ప్రారంభించలేదు.
అధికారులు, పాలకవర్గం నిత్యం ఈ గుంతను చూసి మురిసిపోతున్నారు తప్ప భవన నిర్మాణానికి చర్యలు చేపట్టడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలంలో ఈ గుంత నీటితో నిండి ప్రమాదకరంగా మారుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రేటర్ కార్యాలయం నిర్మించకున్నా కనీసం తీసిన గుంతనైనా పూడ్చి ప్రమాదాలు జరుగకుండా కాపాడాలని వేడుకుంటున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



# ఢిల్లీ చేరిన కడియం కావ్య

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కుటుంబ సమేతంగా శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి డిల్లీకి బయలుదేరి వెళ్లారు.
-వరంగల్ వాయిస్, హనుమకొండ




# 13నుంచి జర్నలిస్ట్ క్రీడలు

8లో

అదే రోజు ఉదయం ఆర్ట్స్ కళాశాల వరకు 3కే రన్

గ్రూప్-1 కారణంగా వాయిదా

ప్రకటించిన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్



# మీ అంచనాలు చేరుకోలేక పోయినందుకు.. క్షమించండి

మద్దతుగా నిలిచిన వారికి ధన్యవాదాలు

బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి

8లో



# బల్దియా భవనం శంకుస్థాపనకే పరిమితం

**గుంతలు తీసి.. నిర్మాణం మరిచిన పాలకులు**

**రెండేళ్లుగా ముందుకు సాగని పనులు**

**ప్రమాదకరంగా మారిన గుంత**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరపాలక సంస్థ కొత్త పరిపాలన భవన నిర్మాణం గుంతలకే పరిమితమైంది. హైదరాబాద్ జీహెచ్ ఎంసీ భవనం మాదిరిగానే జీడబ్ల్యూఎంసీ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటించడంతో శంకుస్థాపన చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అడుగు ముందుకు పడడంలేదు. వచ్చే 50 సంవత్సరాల అవసరాలకు సరిపడే విధంగా ఐదు అంతస్తుల్లో భవనం నిర్మించేందుకు డిజైన్ చేసినా పనుల్లో పురోగతి లేదు. గ్రేటర్ వరంగల్ పరిపాలనా భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు రూ.20.50కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ కు చెందిన కాంట్రాక్టర్ కు పనులు అప్పగించారు. ఇప్పటి వరకు గుంతలు తీయడం తప్ప పనులు ప్రారంభించలేదు.

## రెండేళ్లకింద శంకుస్థాపన..

వరంగల్ నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. చుట్టు పక్కల గ్రామాలు సైతం గ్రేటర్ లో విలీనమయ్యాయి. దీంతో డివిజన్ల సంఖ్య 66కు పెరిగింది. ఇందుకు అనుగుణంగా నూతన పరిపాలన భవనం నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్ పెరుగుతోంది. గత నాలుగైదేళ్లుగా దీనిపై తీవ్ర చర్చ జరిగింది. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశంలోనూ తీర్మాణం చేసి పురపాలక శాఖకు పంపించారు.




ఎట్టకేలకు ముఖ్యమంత్రి హామీల పథకం కింద రూ.20.50 కోట్లతో నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ 20 ఏప్రిల్ 2022న నగర పర్యటనలో భాగంగా బల్దియా నూతన పరిపాలన భవనానికి శంకుస్థాపన చేశారు. నూతన భవన నిర్మాణానికి నిధుల కొరత లేదంటూ ప్రకటించారు.

## ఏడాదిన్నరలో పూర్తి..

వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రస్తుత కార్యాలయానికి సమీపంలోనే ఇండోర్ స్టేడియం ఎదురుగా అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మించాలని నిర్ణయించారు. హైదరాబాద్ కు చెందిన కాంట్రాక్టర్ పనులను దక్కించుకున్నారు. అయితే ఏడాదిన్నర కాలంలో నూతన భవన నిర్మాణం పూర్తి చేయాలంటూ శరతులు విధించారు. టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించినట్లు బిల్డప్ ఇచ్చారు. జేసీబీలను పెట్టి పెద్ద గుంతను తీశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తానంటూ చెప్పి పత్తా లేకుండా పోయాడు. దీంతో గత రెండు సంవత్సరాలుగా ప్రమాదకరంగా మారిన గుంత దర్శనమిస్తోంది.

## ఐదు అంతస్థుల్లో భవనం..

విజన్–2050కి అనుగుణంగా ఐదు అంతస్తుల్లో బల్దియా పరిపాలన భవనం నిర్మించాలని నిర్ణయించారు. జీ ప్లస్ 4 భవనానికి డిజైన్ చేశారు. ఇందులో 150 మంది కార్పొరేటర్లు, ఇతరులు కూర్చునేలా నూతన సమావేశ మందిరం, సెంట్రల్ ఏసీ, లిఫ్టు ఏర్పాటు చేసేలా రూపొందించారు. అన్ని విభాగాల వింగ్ అధికారుల కార్యాలయాలతోపాటు సమావేశ మందిరం, వీడియో కాన్ఫరెన్స్ హాల్ ఏర్పాటు చేసేలా డిజైన్ చేశారు. కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించేలా బీడబ్ల్యూఎంసీ కార్యాలయం నిర్మాణం చేపట్టాలని భావించినా అధికారుల నిర్లక్ష్యం, పాలకవర్గం పట్టింపు లేమితో అడుగు ముందుకు పడడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పాలనాధికారి చర్యలు చేపట్టి బల్దియా నూతన భవన నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# విద్యార్థుల ఎంపిక



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినిలు డీఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్పొరేట్ కాలేజీలో ఉచిత విద్య, హాస్టల్ వసతికోసం నిర్వహించిన అర్హత పరీక్షలో ప్రతిభ చాటారు. ఐదుగురు విద్యార్థినిలు శ్యామల, దీప్తి, స్పందన, అక్షిత, అర్చనలు ఈ అర్హతలు సాధించారు. ఈ మేరకు అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

# గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

**పోలీసుల అదుపులో ముగ్గురు అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులు**

**రూ.50లక్షల విలువైన గంజాయి స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** భారీ స్థాయిలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు రూ.50 లక్షల విలువ కలిగిన 192 కిలోల గంజాయితో పాటు ఒక కారు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెగడపల్లి డబ్బాలు వద్ద నివాసం ఉంటున్న భూపాల్‌పల్లి జిల్లా గోరికొత్తపల్లి గ్రామానికి చెందిన గజ్జి సహదేవ్, మహారాష్ట్రలోని షిరిడీకి చెందిన జ్కె యోగేశ్వర్, కలాట్ వాడికి చెందిన సోమనదత్ రాందాస్ కాలాటిలను పోలీసుల అరెస్టు చేశారు. ఒరిస్సాకు చెందిన పాండు, లక్ష్మీ తాటే, మహారాష్ట్రలోని పంచవటిలో నివిసముంటున్న వికాస్ తాటే పరారీలో ఉన్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడించారు. నిందితుడు గజ్జి సహదేవ్ కారు డ్రైవర్ గా జీవనం కోనసాగిస్తుండగా ఇదే నిందితుడికి మిగితా నిందితులతో పరిచయం అయింది. ఈ పరిచయం కాస్త స్నేహంగా మారింది. వీరందరు సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో గత కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు మండలం, తునగొండ గ్రామ పరిసరాల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రహస్యంగా తరలించి ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఇదే తరహాలో గజ్జి సహదేవ్ మిగితా నిందితులతో కలిసి తునుగొండలో 192 కిలోల గంజాయిని కొనుగోలు చేసి దానిని రెండుకిలోల చొప్పున 96 ప్యాకెట్లుగా విభజించి కారులో ఎవరికి అనుమానం రాకుండా భద్రపర్చారు. కారును చింతూరు నుంచి ఏటూరునాగారం, ములుగు మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నట్లుగా పోలీసులకు అందిన పక్కా సమచారంతో, శనివారం ఉదయం టాస్క్ ఫోర్స్, దామెర పోలీసులు, తమ పరిధిలో శ్రీహర్ష స్కూల్ ప్రాంతంలో వాహన తనీఖీలు నిర్వహించారు. పోలీసులను గుర్తించిన నిందితులు కారులో తప్పించుకుని పారిపోయే క్రమంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కారులో గంజాయి ప్యాకేట్లను గుర్తించిన పోలీసులు కారులో ప్రయాణిస్తున్న నిందితులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో గజ్జి సహదేవ్‌పై గతంలో హనుమకొండ, ఏనుకూరు, పర్కాల పోలీస్ స్టేషన్లలో గంజాయి స్మగ్లింగ్ చేస్తుండగా పట్టుబడ్డ కేసులున్నాయి. ఈ ముఠా సభ్యులను అరెస్టు, గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్స్‌స్పెక్టర్లు సార్లరాజు, ఎస్.రవికుమార్, ఎస్.ఐలు నిస్సార్‌పాషా, శరత్‌కుమార్, దామెర ఎస్.ఐ అశోక్, ఏ.ఏ.ఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుళ్ళు అశోక్, కృష్ణ, కానిస్టేబుళ్ళు సురేష్, శ్రీనివాస్, అంజయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్, అఫ్జల్‌ఖాన్, సతీష్, నాగరాజులను సీపీ అభినందించారు.

# స్కూల్ యూనిఫామ్ పంపిణీలో ముందంజ

**కలెక్టర్ ప్రావీణ్య, డీఆర్డీఓ కౌసల్యాదేవిలకు ప్రశంసలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిర్దేశించిన గడువులోపే ప్రభుత్వ విద్యాసంస్థలకు సమైక్య మహిళల చేత స్కూల్ యూనిఫామ్ కుట్టించి అందజేసి జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుటకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, డీఆర్డీఓ కౌసల్యాదేవిలను పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా వాట్సప్ ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ కౌసల్యాదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యసించే విద్యార్థుల యూనిఫామ్ ను ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా ప్రయోగాత్మకంగా (సెర్ప్) గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల మహిళలకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్య సలహాలు సూచనల మేరకు గత నెల 15వ తేదీన విద్యాశాఖ అధికారుల నుంచి యూనిఫామ్ క్లాత్ తీసుకొని జూన్ ఏడో తారీకు వరకే జిల్లా వ్యాప్తంగా ఉన్న 38,020 మంది విద్యార్థులకు యూనిఫామ్ ను కేవలం 21 రోజుల్లోనే తయారు చేయించి ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు. నిర్దేశించిన గడువులోపే సమర్థవంతంగా పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ అందజేయుటకు అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మండల, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు అన్ని విభాగాల డీపీఎంలకు, ఏపీఎంలకు, సీసీలకు, మాస్టర్ ట్రైనర్స్ కు ఈ సందర్భంగా అభినందించారు.

## మృగశిర కార్తెతో చేపల కొనుగోళ్లు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో శనివారం మృగశిర కార్తె సందర్భంగా చేపల కొనుగోలు కోసం వినియోగదారులు ఆసక్తి చూపారు. చేపల కోసం విక్రయదారుల వద్ద కొనుగోలుదారులు ఎగబడుతున్నారు. సాధారణ రోజుల్లో కిలో చేప రూ.120 నుండి 130 వరకు ధర ఉండగా మృగశిర కార్తె రోజు కిలో చేప రూ.150 నుంచి 200 వరకు ధర పలుకుతుందని వినియోగదారులు చెబుతున్నారు.

## డీసీసీబీలో తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకం

### అత్యధికంగా 8.10 శాతం వడ్డీ




**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో నూతనంగా తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకం పాలసీ ద్వారా అత్యధిక వడ్డీ 8.10% ఇవ్వడం జరుగుతుందని మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి తెలిపారు. కాబట్టి, మాదారం పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల ప్రజలు రైతులు ఈ మంచి అవకాశాన్ని ఉపయోగించుకొని డీసీసీబీ పరకాల బ్రాంచ్ లో డబ్బులు డిపాజిట్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాదారం సీఈవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్ల కురుమలకు న్యాయం చేయాలి

### బీజేపీ జిల్లా నాయకులు కె.మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** గత రెండు సంవత్సరాల క్రితం గత ప్రభుత్వం గొల్ల కురుమలకు సబ్సిడీ కింద గొర్రెలు అందిస్తామని చెప్పడంతో చాలామంది వర్ధన్నపేటకు చెందిన పేద గొల్ల కురుములు కష్టపడి సంపాదించుకున్న, అప్పులు తెచ్చిన డబ్బులతో డీడీలు తీసి ప్రభుత్వ ఖాతాలో జమచేశారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ గొర్రెలు రాక అప్పుల పాలై వీధిన పడ్డ కుటుంబాలను ఆదుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం వారికి ఎటువంటి న్యాయం చేయకుండా పాత డీడీలను వాపస్ తీసుకోవాలని ఒత్తిడి తెస్తూ వారి డీడీలను తిరిగి ఇచ్చే ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని డీడీలు తీసిన ప్రతి ఒక్కరికి గొర్రెలు పంపిణీ చేసి ప్రతి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారి తరపున పోరాటం చేస్తామని బీజేపీ జిల్లా నాయకులు మహేందర్ రెడ్డి హెచ్చరించారు.

## మేలైన వైద్య సౌకర్యం కల్పించాలి

### మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోనిగత ప్రభుత్వం హయాంలో మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ కోసం నడికూడ మండల కేంద్రంలో ప్రాథమిక చికిత్స కేంద్రం( పీహెచ్ సీ సెంటర్)ను శాంక్షన్ చేయించారని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు తెలిపారు. ప్రారంభోత్సవ సమయంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున శంకుస్థాపన పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీనిని ఆసరాగా తీసుకున్న ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని పీహెచ్ సీని తరలించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పరకాల శాసన సభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నడికూడ మండల కేంద్రంలో పీహెచ్ సీ సెంటర్ ను పునరుద్ధరించాలని కోరారు. దీని వలన మండల కేంద్రంలోని 14 గ్రామాల ప్రజలు అత్యవసర వైద్య సేవలు, ప్రాథమిక చికిత్సలు అందుతాయని సూచించారు.

# మోడీ విధానాలను వ్యతిరేకించిన దేశ ప్రజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత నెల రోజులుగా జరిగిన 18వ పార్లమెంటరీ ఎన్నికలలో మోడీ ప్రభుత్వం అనుసరించిన బ్రాహ్మణీయ, ఫాసిస్టు విధానాలకు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా భారత ప్రజలు ఓటు వేశారని, ఇది మోడీ ప్రభుత్వానికి చెంప దెబ్బ లాంటిదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్ అన్నారు. నగరంలోని విద్యానగర్ ఏరియాలో శనివారం న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత, 10 సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం అనుసరించిన విధానాలకు, కార్పొరేట్ ముసుగులో ఉన్న పెట్టుబడుదారులు దేశ సంపదను, పీడిత ప్రజల శ్రమను దోచిపెట్టి, వారికి అనుకూలంగా వ్యవహరించడం వల్లనే మోడీ నాయకత్వాన్ని ప్రజలు తిరస్కరించారని ఆయన అభిప్రాయపడ్డారు. తన పార్టీకి సంపూర్ణ మెజారిటీ వస్తే భారత రాజ్యాంగ స్థానంలో బ్రాహ్మణీయ రాజ్యాంగ వ్యవస్థను అమలు చేయాలనుకున్నాడని, ప్రస్తుతం ఉన్న పార్లమెంటరీ వ్యవస్థను కూడా రద్దుచేసి అధ్యక్షత తరహా ప్రభుత్వ వ్యవస్థను తీసుకురావడానికి చేసిన కుట్రలు ఫలించలేదని ఆయన తెలిపారు. మోడీ ప్రభుత్వం, ఈడీ, ఐటీ, సీబీఐ తదితర సంస్థలను అడ్డుపెట్టుకొని తనను ప్రశ్నించిన, ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులను గురిచేయడం, ప్రభుత్వాలను పడగొట్టడం, పార్టీలను చీల్చడం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా నిత్యవసర నిత్యావసర సరుకులు ధరలు పెరగడం, ప్రజల ప్రజాస్వామిక హక్కుల అణచివేత, ఉపాలాంటి నల్ల చట్టాలు ప్రయోగించి విప్లవకారులను, మేధావులను, ప్రజాస్వామిక వాదులను జైల్లో పెట్టడం, ఆదివాసీలను అతి కిరాతకంగా హత్యలు చేయడం, పౌరసత్వ సవరణ చట్టం ఆర్టికల్ 370 రద్దు చేయడం, రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని పోరాడుతున్న రైతాంగం పై ఉక్కు పాదం మోపడం లాంటి ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించిందని ఆయన మండిపడ్డారు. రాబోవు నూతన బీజేపీ-ఆర్ఎస్ఎస్ ల ఎన్ డీఏ ప్రభుత్వం ఇదే విధానాలు కొనసాగిస్తే ఆ ప్రభుత్వానికి కూడా ఇదే గతి పడుతుందన్నారు. ప్రజలు ప్రజాసామికవాదులు నిరంతర జాగ్రత్తగా ఉంటూ సామ్రాజ్యవాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని, నూతన ప్రజాసామిక వ్యవస్థ నిర్మాణం కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు ఎలకంటి రాజేందర్ లు మాట్లాడారు. న్యూ డెమోక్రసీ ప్రజా సంఘాల నాయకులు గట్టు కృష్ణ, రంజిత్ కుమార్, ఇనుముల కృష్ణ, ప్రభాకర్, తిరుపతి, హరిబాబు పాల్గొన్నారు.

## ఏవీవీ ఉన్నత పాఠశాల బడిబాట




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని స్థానిక ఏవీవీ ఉన్నత పాఠశాల (ఇంగ్లీష్ మీడియం) ఉపాధ్యాయ బృందం గత నాలుగు రోజుల నుంచి పాఠశాల పరిసర ప్రాంతాలైన పోతన నగర్, రాజీవ్ కాలనీ, ఓఎస్ నగర్, పాపయ్యపేట్, మట్టెవాడ, కుంటి భద్రయ్య గుడి ప్రాంతం, రామన్నపేట్, గోపాలస్వామి గుడి ప్రాంతం, పాటక్ మహల్ ప్రాంతాలలో వాడవాడలా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఏవీవీ పాఠశాల ఔన్నత్యాన్ని వివరిస్తూ, బడి ఈడు పిల్లలను ఏవీవీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. అదేవిధంగా శనివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా.ఎ.భుజేందర్ రెడ్డి, పూర్వ ప్రధానోపాధ్యాయుడు, ప్రస్తుత అకాడమిక్ కోఆర్డినేటర్ టి.వాసుదేవులు, ఉపాధ్యాయ బృందం ఎ.సంధ్యారాణి, ఎన్.నవీన్, జి.భాగ్యలక్ష్మి, ఇ.వెంకటేశ్వర్లు, జి.వీరేశలింగం, జి.సుధారాణి, వి.రమాదేవి, చిలుక భాస్కర్, ఎమ్. శ్రీకాంత్, సీహెచ్.రాజేశ్వరి, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## నన్నుట రాజేశ్వర్ గంగపుత్రకు సన్మానం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మహ నగరంలోని కింగ్స్ కోహినూర్ క్రౌన్ కన్వెన్షన్ లో తోలిసారి నిర్వహిస్తున్న ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ లో వరంగల్ కు చెందిన గంగపుత్రుడు, ప్రముఖ జాతీయ చిత్రకారుడు నన్నుట రాజేశ్వర్ గంగపుత్ర హైదరాబాద్ ఆర్ట్ సొసైటీలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర సందర్శించారు. ఈ సందర్భంగా చిత్రకారుడు నన్నుట రాజేశ్వర్ గంగపుత్రకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ రాజేశ్వర్ గంగపుత్ర వేసిన చిత్రాలు తన చిన్నతనం నాటి గంగపుత్ర మహిళలు చేపల చెరువు వద్దకు తాగునీటి కోసం బిందెలతో వచ్చి ముచ్చట్లు పెడుతున్న, చేపల అమ్మకాల కళాఖండాలు అతడి చిత్ర నైపుణ్యానికి ప్రతీకలని కొనియడారు. నన్నుట రాజేశ్వర్ గంగపుత్ర లాంటి చిత్రకారులను రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు కల్పించి పర్యాటక శాఖ ద్వారా చిత్ర కళాకారులకు ప్రోత్సాహం అందించాలని కోరారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్ ఎగ్జామ్‌కు ఏర్పాట్లు పూర్తి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జూన్ 9 ఆదివారం టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, పరీక్ష ఏర్పాట్లలో కట్టు దిట్టమైన భారీ బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని, పరీక్ష సెంటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం గూగుల్ మీట్ ద్వారా గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్, గ్రూప్ వన్ రీజినల్ కో కోఆర్డినేటర్ శ్రీనివాస్ రావులు, చీఫ్ సూపరెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ
జిల్లాలో 12 సెంటర్లు ఉన్నాయని, ఒక్కొక్క సెంటర్ కి పరీక్షా కేంద్రాల విస్తీర్ణాన్ని బట్టి 4412 మంది అభ్యర్థులను సిట్టింగ్ అరేంజ్ మెంట్ చేయడం జరిగిందని అన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ నిబంధనలన్నియు టీజీపీఎస్సీ నిబంధనలను అనుసరించి ఏర్పాటు చేయడం జరిగిందని, హాల్ టికెట్ వెనకాల ఉన్న నిబంధనలను ప్రతి ఒక్క అభ్యర్థి క్షుణ్ణంగా చదివి వాటిన అనుసరించి పరీక్ష రాయవలసిందిగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ ఏర్పాట్లలో కొత్త నిబంధనల మేరకు ఓఎంఆర్ షీట్ పైన అభ్యర్థి పేరు ఉంటుందని, ఓఎంఆర్ షీట్ ఇవ్వగానే ముందుగా వారి పేరు ఉందో లేదో సరి చూసుకుని పరీక్షను ప్రారంభించవలసిందిగా జిల్లా కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ తహసీల్దార్ భగవాన్ రెడ్డి, గ్రూప్-1 ఎగ్జామినేషన్ సూపరెండెంట్ భద్రకాళి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

## జస్టిస్ పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా న్యాయస్థానంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పసుపులేటి చంద్ర శేఖర్ ప్రసాద్ పాల్గొని లోక్ అదాలత్ కు హాజరైన వివిధ కేసుల కక్షిదారులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ ను ఆదాలత్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ వివిధ కేసుల్లో కక్షిదారులు తమ కేసులను రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడ గలిగే క్రిమినల్, సివిల్ భూ తగాదా, మోటార్ వాహన ప్రమాదం, వివాహ, భార్యాభర్తల గొడవలు, కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్స్, డిజాస్టర్ మేనేజ్ మెంట్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ (దొంగతనాలు), ట్రాఫిక్, ఈ-చలాన్ కేసులను ఇరుపక్షాల వారి అంగీకారంతో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కక్షిదారులు తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టుల్లో తెలియజేసి రాజీ కుదుర్చుకుని కుటుంబసభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. కక్షిదారులు తమ



న్యాయవాదులతో నేరుగా కోర్టులో హాజరై తమ కేసులను పరిష్కరించుకోవాలని, జిల్లా వ్యాప్తంగా గుర్తించబడిన కేసుల్లో మొత్తం పెండింగ్ కేసులను పరిష్కరించడం కోసం ప్రత్యేకంగా జాతీయ లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి మౌనిక, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, జిల్లా కోర్టు పరిపాలన అధికారి క్రాంతి కుమార్, సూపరిండెండెంట్ అమరేందర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, వివిధ కేసుల్లోని నిందితులుగా పరిష్కార కోసం వచ్చిన కక్షిదారులలో ఒక జంటకు వారి ఇరువురు అంగీకారంతో విడాకులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమానికి తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఉమ్మడి నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయం సాధించడంతో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి చిందం రవి, మండల ఉపాధ్యక్షుడు మారపల్లి కటయ్య, ఐఎన్ టీయూసీ మండల అధ్యక్షుడు మారేపల్లి రాజేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల రైపాల్, నాయకులు వరదరాజు, బాస్ అని మార్కండేయ, వల్పదాసు రాము, ఎండీ సాదిక్, ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

## జేసీబీతో చెత్త తొలగింపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగశాయిపేట, ఉర్సు ఉప్పరోనికుంట నుంచి వచ్చు వరద నీరు మురుగునీరు అంతా మురుగు నీటి శుద్ధి కేంద్రానికి వెళ్లేందుకు సరైన బాక్స్ డ్రైనేజీలు లేనందుననే వర్షాకాలంలో ఉర్సు శ్మశాన వాటిక, ఉప్పరోనికుంట, తాళ్ల పద్మావతి కాలేజీ, డీకే నగర్ ప్రాంతాలు జలమయమవుతున్నాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. మురుగు నీటి శుద్ధి కేంద్రం వారు వారి ప్లాంట్ లోకి వెళ్లు డ్రైనేజీ చిన్నదిగా ఏర్పాటు చేసుకోవడం వలన మురుగు నీరంతా రోడ్లపైకి వస్తుందన్నారు. శాశ్వత డ్రైనేజీ పనుల నిర్మాణ కోసం మహానగర పాలక సంస్థ కమిషనర్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతంలో పర్యటింప చేస్తానని ఆయన తెలిపారు. శనివారం మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కచ్చా కాలువలో పెరిగిన గడ్డిని చెత్తాచెదారాన్ని జేసీబీ ద్వారా తొలగించడంతో నీరంతా శుద్ధి కేంద్రంలోకి వెళుతుందన్నారు.

## ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న విజయం ప్రజాస్వామ్య శక్తుల విజయం

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలి సభ్యులుగా తీన్మార్ మల్లన్న ( చింతపండు నవీన్) ఎన్నిక కావడం పట్ల బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు హర్షం ప్రకటించారు. ఇది ప్రజాస్వామ్య లౌకిక శక్తుల విజయానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో పాటు బీసీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు మల్లన్న విజయానికి తీవ్రంగా కృషి చేశారన్నారు. అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలకు ఎంతో చైతన్యంతో తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించిన వారందరికీ అభినందనలు తెలియజేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు, బీసీలకు రిజర్వేషన్లు, సామాజిక న్యాయం, విద్య, వైద్యం తదితర సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకగా ఉండి సాధించే దిశగా చిత్తశుద్ధితో మల్లన్న కృషి చేస్తారన్న ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. ఎంతో నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం ప్రజల ప్రయోజనాలే పరమావధిగా మల్లన్న కృషి చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

## గ్రూప్-1 అభ్యర్థులు సూచనలు పాటించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు జరగబోవు గ్రూప్-1 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షకు వచ్చే ముందు సూచనలు (ఇన్ స్ట్రక్షన్స్) తప్పకుండా చదివి అర్థం చేసుకోవాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, గడియారాలు, స్కేలు ఇతరత్రా వస్తువులు మగవారు ధరించే బెల్టులు, బూట్లు కూడా పరీక్ష హాల్లోకి అనుమతి లేదని అభ్యర్థులు గమనించాలని అలాగే మహిళా అభ్యర్థులు హ్యాండ్ బ్యాగులు, వాటర్ బాటిల్స్, గొడుగులు ఇతరత్రా వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రంలోకి అనుమతించటం జరగదని గమనించాలని కోరారు. 9 గంటల నుంచి పరీక్ష హాల్లోకి ప్రవేశం ఉంటుందని అభ్యర్థులు చివరి నిమిషంలో వచ్చి ఇబ్బందులు పడే కన్నా ముందే వచ్చి పరీక్షా కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంతో కష్టపడి ఉద్యోగం కోసం శ్రమిస్తున్న విద్యార్థులంతా ఈ సూచనలు పాటించి పరీక్షను విజయవంతంగా రాస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## హోటల్‌ను ప్రారంభించిన నల్గొండ రమేష్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిమ్మని వేణు కుమారుడు చిమ్మని మహేష్ ధనశ్రీ హోటల్ ప్రారంభానికి సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నల్గొండ రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి హోటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులు నల్గొండ రమేష్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రీష్మితకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని రంగసాయిపేటకు చెందిన దామెరకొండ గ్రీష్మిత ఆల్ ఇండియా 720/664 నీట్ లో ర్యాంకు సాధించిన సందర్భంగా 42వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మునుకుంట్ల విజయ ఆధ్వర్యంలో శనివారం వారి స్వగృహంలో శాలువాతో సత్కరించారు. మంచి ర్యాంక్ సాధించినందకు గాను గ్రీష్మితకు బొకే అందించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ గ్రీష్మిత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో నగర మహిళా ఉపాధ్యక్షురాలు కానుగంటి పద్మావతి, చిట్ల హేమలత, బక్కి కల్పన, బక్కి స్వరూప, వనం లావణ్య, బజ్జూరి నిర్మల, బజ్జూరి రేణుక, చిట్ల సంధ్య, దామరుప్పుల రజిత, ఆడుప లలిత పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న గెలుపు హర్షనీయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో క్యూ న్యూస్ ద్వారా ప్రజల సమస్యలపై పోరాడిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని యూత్ కాంగ్రెస్ నాయకులు కల్లూరి పవన్ అన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు చేసిన అవినీతి పై పోరాడిన వ్యక్తి మల్లన్న, బీఆర్ ఎస్ పార్టీ నాయకులు మల్లన్న గెలువకుండా ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసిన గ్రాడ్యుయేట్ లు మాత్రం నమ్మకుండా మల్లన్నను గెలిపించారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ పైవు ఉన్నారని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ పై తప్పుడు ప్రచారం చేయడం మానేయాలని హితవు పలికారు. ఇలాంటి ప్రచారాలు చేస్తే ప్రజలు పూర్తిగా తెలంగాణ రాష్ట్రం నుంచి తరిమి కొడుతారన్నారు.

## మానవ సంబంధాలతోనే సమాజ మనుగడ

**వరంగల్ వాయిస్, కేయూ :** "మానవ సంబంధాలతోనే సమాజ మనుగడ" అని కాకతీయ విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీ రాజు వల్లాల అన్నారు. విభాగ అధిపతి ఆచార్య టి.సవితా జ్యోత్స్న నిర్వహణలో రసాయన శాస్త్ర విభాగ సెమినార్ హాల్ లో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల 3 వారాల ఇండస్ట్రియల్ ట్రైనింగ్ లో భాగంగా అధ్యాపకులకు "21వ శతాబ్దం లో మానవ సంబంధాలు"అనే అంశంపై మాట్లాడారు. విద్యార్థిలో మానవ సంబంధాలు పెంపొందించటంలో అధ్యాపకుల పాత్ర వివరించారు. టీనేజ్ లో యువతకు మానవ సంబందాల ప్రాముఖ్యతను తెలపాలన్నారు. ఆక్టివిటీ లు, రోల్ ప్లే, సమస్య పరిష్కార విధానాల ద్వారా మానవ సంబంధాల ప్రాముఖ్యతను వివరించారు. ఉత్తమ సమాజ నిర్మాణంలో, సమాజ మనుగడ, అభివృద్ధిలో, వ్యక్తిత్వ వికాసంలో మానవ సంబంధాలు ఎలా ఉపయోగపడుతాయి, క్షీణిస్తున్న మానవ సంబందాలు ఎలా పదిలపరుచుకోవాలి, పెంపొందించుకోవాలి అనే విషయాలపై పవర్ పాయింట్, ఆడియో, విజ్యువల్ ద్వారా ప్రెజెంట్ చేశారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ 11 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.9,700 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 22మందికి రూ.13,300 జరిమాన విధించినట్లు ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు.

## పట్టభద్రులకు కృతజ్ఞతలు

### జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** రాష్ట్రంలో 10 ఏళ్ల పాటుగా తీన్మార్ మల్లన్న ప్రశ్నించే గొంతుకై ప్రజల వైపున నిలబడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించిన తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపించి పట్టం కట్టిన పట్టభద్రులకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన భయపడకుండా జైలు జీవితాన్ని కూడా గడపాడని మల్లన్నను కొనియాడారు. తీన్మార్ మల్లన్నను ఓడించాలని ఎన్నో కుట్రలు పన్నారని, అయినా కూడా గెలిచి తన సత్తా ఏంటో చూపించారని అన్నారు. మున్నూరు కాపు, బీసీ బిడ్డ తీన్మార్ మల్లన్నను గెలిపించిన పట్టభద్రులందరికీ, సహకరించిన మేధావులందరికీ, కాంగ్రెస్ నాయకులందరికీ కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రామోజీరావు పార్థివదేహానికి కడియం నివాళి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీ రావు మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రామోజీ రావు పార్థివదేహాన్ని శనివారం కడియం సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అక్షర యోధుడు, పత్రికా రంగానికి నూతన ఒరవడిని సృష్టించిన గొప్ప మహానుభావుడు రామోజీ రావు అని, అలాంటి వ్యక్తి ఇక మన మధ్య లేడు అనే విషయం చెప్పడానికే చాలా బాధగా ఉందని అన్నారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో ఎదిగిన గొప్ప దార్శనికుడు రామోజీ రావు అని తెలిపారు. మీడియా రంగంలో, సినిమా రంగంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని, రామోజీ రావును కోల్పోవడం దేశానికి తీరని లోటని తెలిపారు.

## అక్షర యోధుడు రామోజీకి ఐజేయూ అశ్రు నివాళి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనాడు గ్రూప్ సంస్థల స్థాపనతో మీడియా రంగంలో విప్లవం సృష్టించి, సమాజంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని కైవసం చేసుకున్న ఆ సంస్థ అధినేత రామోజీరావు మరణం మీడియా రంగానికే కాకుండా యావత్తు సమాజానికే తీరని లోటుగా భావిస్తున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖలు తెలిపాయి. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన ఘనత రామోజీ రావుకే దక్కుతుంది. నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేస్తూ ఆయన ఎందరికో రామోజీరావు స్ఫూర్తినిచ్చారు. ముఖ్యంగా తెలుగు దిన పత్రికల విస్తరణకు, నూతనత్వానికి ఆద్యులు రామోజీ రావు. పత్రికా రంగంలో తెలుగు జర్నలిజానికి అఖిల భారత స్థాయిలో గుర్తింపు తెచ్చిన గొప్ప వ్యక్తి రామోజీ రావు. తెలుగు భాష సమున్నతికి, తెలుగు జర్నలిజం ద్వారా కృషి చేసిన కృషీ వలుడిని కోల్పోవడం బాధాకరమని, రామోజీ రావు మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు

## రామోజీ మరణం పత్రికా రంగానికి తీరని లోటు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకుడు, రామోజీ ఫౌండేషన్ చైర్మన్ రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటుని విశ్రాంత సమాచార శాఖ అధికారి విధుమౌళి తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో తమ సంస్థల ద్వారా వేలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశం కల్పించి తమ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

## అక్షర యోధుడికి అశ్రునివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాగ్దేవి విద్యా సంస్థల అధిపతి చందుపట్ల దేవేందర్ రెడ్డి, వాహినీ దేవి దంపతులు ,కళాశాల ప్రిన్సిపల్ శేషాచలం చలం గార్లతో కలిసి రామోజీ రావుకు శ్రద్ధాంజలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, కాలేజీ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రామోజీ రావు మరణం జాతికి తీరని లోటు

### వకుళాభరణం కృష్ణ మోహన్ రావు




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావు మరణం దిగ్భ్రాంతికి లోనుచేసిందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. రామోజీ రావు పత్రికా, టీ.వీ మాధ్యమ రంగాలలో దిగ్గజుడిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న రామోజీ రావు, చరిత్ర పుటలలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించుకున్నారు. ఈనాడు, ఈటీవీలను ప్రారంభించి మీడియా రంగంలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. జర్నలిస్ట్ అనే ప్రతినిధిని ఒక భాధ్యతయుతమైన పౌరుడిగా, పత్రికా రంగం, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక వారధిగా నిలిచే వ్యవస్థగా రూపొందించారు. చతుర, విపుల, తెలుగు వెలుగు లాంటి పత్రికలను నడిపి తెలుగు కథ, కవిత, నవలా, కథానిక ఇలా భాషలోని వివిధ ప్రక్రియలకు ప్రోత్సాహం ఇచ్చారు. తెలుగు భాషకు పట్టం కట్టారు. వారి ఆకస్మిక మరణం యావత్ తెలుగు సమాజాన్ని విషాదంలో ముంచింది. ఆయన మరణం పట్ల ప్రగాడ సంతాపం ప్రకటిస్తున్నాం. శనివారం ఆయన మరణ వార్త తెలిసిన అనంతరం, రామోజీ ఫిల్మ్ సిటీ లోని నివాసంలో ఉదయం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి, ఘనంగా నివాళులు అర్పించారు

## కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం కొండా దంపతుల ఆదేశాలు మేరకు 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ జంక్షన్ లో ఈనాడుగ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ మాట్లాడుతూ రామోజీరావు గొప్ప వ్యక్తి అని, మీడియా రంగంలో ఎన్నో అవార్డులు పొందారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్ కుమార్, 20వ డివిజన్ అధ్యక్షుడు కుసుమ సతీష్, కాంగ్రెస్ నాయకులు నీలం శ్రీనివాస్, ఎండీ మక్బుల్, కట్కూరి అవినాష్, పోలేపాక సుధాకర్, నాగరాజు, కొమ్ముల ప్రదీప్, యాకూబ్, నాగరాజు, పాలకుర్తి హరిప్రసాద్, బట్టు శేషు, వెంకన్న, జంగం ప్రభాకర్, సుందరగిరి శ్రీనివాస్, పూర్ణిందర్ రెడ్డి, శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రామోజీరావుకు శ్రద్ధాంజలి



నా మార్గదర్శి,
మా మకుటంలేని మహారాజు,
ఏనాటికానాడు ఈనాడు,
తెలుగు నుడికారంలో అన్ని
యాసల ప్రయోగ ప్రయోక్త,
చేతలతో చైతన్యం నింపిన
చెరుకూరి,
పొలాల్లో ఏరువాక,
సెలయేళ్ళలో మృగశిర కార్తె,
భారత పద్మ విభూషణుడు,
అనితర సాధ్యమైన లక్ష్యాలను తానే ప్రోదిచేసుకుని,
గెలిచితీరిన విలుకాడు,
కలం కార్మికునిగా నన్ను తొలిసారి పరీక్షించి,
ప్రయోజకున్నని నమ్మి కొలువిచ్చిన యజమాని,
నా అంచెలంచెల ఎదుగుదలను గమనిస్తూ
ముచ్చటపడిన
మా పెద్ద రామోజీ రావు అస్తమయం తీరని వెలితి.
కిరణ్ కీ, వారి విశాల కుటుంబానికి ప్రగాఢ సంతాపం.
వారి ఎడబాటు విషాదం నేనూ అనుభవిస్తున్నాను.
రామోజీ దివంగతాత్మకు
శాశ్వత ప్రశాంతి కోసం పరమాత్మకు వేడుకోలు.

రాపోలు ఆనంద భాస్కర్

# ఘనంగా బీఆర్ భగవాన్ దాస్ జయంతి వేడుకలు

### ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు, సీపీఐ నేతల నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీపీఐ సీనియర్ నాయకులు, కార్మిక నేత బీఆర్ భగవాన్ దాస్ 94వ జయంతి వేడుకలు శనివారం హనుమకొండలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక అశోక జంక్షన్ లోని భగవాన్ దాస్ విగ్రహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ వరంగల్ నగరానికి నేడు తాగు నీరు వచ్చాయంటే కామ్రేడ్ బీఆర్ భగవాన్ దాస్ పోరాటాల ఫలితమేనన్నారు. పేద ప్రజల సమస్యలపైన అనేక పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి బీఆర్ భగవాన్ దాస్ అని తెలిపారు. అనుక్షణం పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన గొప్ప మహనీయుడ అన్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు, కాకతీయ కెనాల్ ద్వారా వరంగల్ పట్టణానికి త్రాగు నీరు అందించడంలో బీఆర్ భగవాన్ దాస్ కీలక పాత్ర పోషించారని వెల్లడించారు. బీఆర్ భగవాన్ దాస్ పోరాటాల స్ఫూర్తితో, ఆయన సహకారంతోనే రాజకీయాలలో తాను నిలదొక్కుకున్నానని పేర్కొన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి శ్వాస వరకు కట్టుబడి ఉన్న వ్యక్తి బీఆర్ భగవాన్ దాస్



అని, అలాంటి గొప్ప వ్యక్తి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తాను చిన్ననాటనే భగవాన్ దాస్ మాటలకు ఆకర్షితుడినై, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగానని అన్నారు. ఆయన ఆశయాలను ముందు తరాలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ తాము బీఆర్ భగవాన్ దాస్ రాజకీయ వారసులుగా ఆయన కోరుకున్న సమసమాజ నిర్మాణం కోసం కృషి చేస్తామని, ఆయన చూపిన బాటలోనే ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, డాక్టర్ బి.రాజ్ సిద్ధార్థ, బీఆర్ అంబేద్కర్, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు బీఆర్ లెనిన్, తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, మాజీ కార్పొరేటర్లు టి.విద్యాసాగర్, వీరగంటి రవీందర్, జోరిక రమేష్, సీపీఐ నాయకులు బుస్సా రవీందర్, ఎన్.రాజమౌళి, కొట్టెపాక రవి, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, కండె నర్సయ్య, ఏశబోయిన శ్రీనివాస్, సంజయ్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో సత్తా చాటుతున్న సంగీత

## రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ

## సహకారం అందిస్తే జాతీయ స్థాయిలో రాణించే ఛాన్స్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన మౌటం శ్రీనివాస్-రమ దంపతుల కూతురైన సంగీత అథ్లెటిక్స్, గేమ్స్ లో రాణిస్తూ సత్తా చాటుతుంది. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన సంగీత గత రెండేళ్లుగా గేమ్స్ మాస్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జావలింగ్, డిస్క్ త్రో, హామర్ అథ్లెటిక్స్ పోటీలతో పాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో శిక్షణ పొంది జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తోంది. ఇప్పటికే స్కూల్ తరపున 15 చోట్ల పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రశంసలు అందుకుంది. గత ఏడాది కరీంనగర్ లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో హమర్ విభాగంలో కాంస్య పతకాన్ని



సాధించగా, గత కొద్ది రోజుల క్రితం హనుమకొండలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో జావలింగ్, డిస్క్ త్రో విభాగంలో సిల్వర్, కాంస్య పథకాలను సాధించింది. జిల్లా రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్న సంగీతను మండల విద్యాధికారి రామకృష్ణరాజు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు వచ్చేలా శిక్షణ ఇచ్చిన గురువులు కృష్ణమూర్తికి, ప్రధానోపాధ్యాయులు రంగనాథ్, ఉపాధ్యాయులకు స్టూడెంట్ సంగీత ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఎవరైనా సహకారం అందిస్తే దేశ స్థాయిలో రాణించి, మరిన్ని పతకాలు సాధిస్తానని తెలుపుతోంది. ఆటల్లోనే కాదు చదువుల్లోనూ సంగీత ముందుంటుంది.



# రసాయన శాస్త్ర ఆసక్తి పరిశోధనకు నాంది



**వరంగల్ వాయిస్, కేయూ :** "రసాయన శాస్త్ర ఆసక్తి పరిశోధనకు నాంది" అని కాకతీయ విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి అన్నారు, రసాయన శాస్త్ర విభాగ సెమినార్ హాల్ లో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల 3 వారాల ఇండస్ట్రియల్ ట్రైనింగ్ లో భాగంగా అధ్యాపకులకు రసాయన శాస్త్రంలో ప్రస్తుతం వస్తున్న విస్తృత మార్పులు వివరించారు. విద్యార్థికి ఆసక్తి కల్పించటంతో సృజన మొదలవుతుంది. నేచర్ ను చూసి అతనిలో పరిశోధనలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. ప్రస్తుతం వస్తున్న వివిధ వ్యాధులు, రోగాల బారిన పడకుండా సహజ సిద్ధంగా ప్రకృతితో ఎలా మెలగాలనేది తెలుస్తుందని పేర్కొన్నారు. ఫీల్డ్ నుంచి ప్రయోగశాలకు, అనంతరం తరగతి గదికి అనుసంధానం జరగాల్సిన అవసంర ఉందన్నారు. సహజ సిద్ధమైన పరిస్థితులు కల్పించాలని, విద్యార్థి ఒక్కసారి తన ఇష్టాన్ని చూపెడితే చాలు అన్నారు. ప్రస్తుతం బోధన, ప్రయోగ పద్ధతిలో విస్తృత మార్పులు చోటు చేసుకున్నాయన్నారు, తదనుగుణంగా అధ్యపకుల సరళిలో కూడా మార్పులు రావాలన్నారు. శక్తి వినియోగం, దాని ద్వార కణాల్లో వచ్చే మార్పులు వివరించారు. విభాగ అధిపతి ఆచార్య టి.సవితా జ్యోత్స్నతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

# హెూరాహెూరీగా రాష్ట్ర కబడ్డీ పోటీలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఖాజా బాయి మెమోరియల్ ఆధ్వర్యంలో డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామంలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీలు హెూరాహెూరిగా జరుతున్నాయి. మానుకోట, ఖమ్మం, విజయవాడ, హైద్రబాద్, కరీంనగర్ నుంచి కబడ్డీ క్రీడకారుల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. రెండు రోజులు వర్షం ఆటంకం కలిగించిన 16 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. డోర్నకల్ మండలంలోని బంజార గ్రామ ప్రతాప రెడ్డి మెమోరియల్ జట్టు లీగ్ ఎంట్రీ కి వచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్ లో విడిది ఏర్పాటు చేశామని నిర్వహకులు బీమనబోయిన సంతోష్, తోట ప్రసాద్, రామకృష్ణ, యాదగిరి, ఉప్పయ్య, రమణబోయిన రాజు, శ్రీనివాస్, సురేష్, మహేష్, సాగర్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధం

## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రేపు జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష సజావుగా నిర్వహించుటకు గాను జిల్లా నుంచి గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవుతున్న 9092 మంది అభ్యర్థుల కోసం 17 కేంద్రాలలో కనీస సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. 17 మంది డిపార్ట్ మెంటల్ అధికారులు, 25 పర్యవేక్షకులు, 5 రూట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష హాల్లోకి అనుమతిస్తారని , 10 గంటలకు పరీక్ష కేంద్రాల గేటులను మూసివేస్తారని, 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా ఎవరిని అనుమతించడం జరగదన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ లో ఉన్న నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఒక కలర్ ఫోటో, ఒరిజినల్ ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి గుర్తింపు కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకొని రావాలన్నారు. హాల్ టికెట్ లో ఫోటో సరిగ్గా కనిపించకపోయినట్లయితే 3 కలర్ ఫోటోలు తీసుకొని హాల్ టికెట్ పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకుని రావాలని తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందస్తుగా చూసుకున్నట్లయితే పరీక్ష రోజు పరీక్ష కేంద్రానికి సులువుగా చేరుకోవచ్చని, పరీక్ష రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే అనుమతిస్తారని అన్నారు. పరీక్ష హాల్లోనికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్, క్యాలిక్యులేటర్ , వైట్ పేపర్స్ , పెన్ డ్రైవ్ , టాబ్లెట్ , హియరింగ్ సొల్యూషన్స్ సంబంధించిన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతించడం జరగదన్నారు, అలాగే అభ్యర్థులు షూస్ కాకుండా కేవలం చెప్పులను మాత్రమే ధరించి రావాలని తెలిపారు. తర్వాత పరీక్ష పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 1 గంట వరకు ఎవరిని బైటికి పంపడం జరగదని, అభ్యర్థులు పరీక్ష రాసిన తర్వాత ప్రశ్నాపత్రం తమతో పాటు తీసుకువెళ్లడానికి వీలుగా ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీ చేసినట్లయితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

# పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

**వరంగల్ వాయిస్, కేయూ :** జూన్ 11 నుంచి ప్రారంభం కావలసిన కాకతీయ విశ్వవిద్యాలయ పీజీ రెండవ సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్టు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. నరసింహ చారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి డాక్టర్ బీ.ఎస్.ఎల్. సౌజన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలుపుతామని, విద్యార్థులు, కళాశాలల యాజమన్యం గ్రహించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

## డబ్బులు, అక్రమ సంబంధమే కారణం

## వివరాలను వెల్లడించిన మడికొండ సీఐ ప్రతాప్



**వరంగల్ వాయిస్, మడికొండ :** వరంగల్ నగరంలోని భట్టుపల్లి బైపాస్ రోడ్ లోని శ్రీ సాయినాథ్ మేఘ గ్రీన్ సిటీలో గత బుధవారం ఒక మహిళను దారుణంగా హత్య చేసిన ఘటనలో శుక్రవారం కాజీపేట ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో మడికొండ పోలీసులు కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. సీఐ ప్రతాప్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఉర్సు కరీమాబాద్ కి చెందిన మహమ్మద్ ఇంతియాజ్ ఆటోలను కిరాయికి ఇస్తూ ఉండేవాడు. సుమారు మూడు సంవత్సరాల కిందట తన భార్య షహీనా, తన భర్త మహమ్మద్ ఇంతియాజ్ చెడు అలవాట్లను భరించలేక తన తల్లి ఇంటికి వెళ్ళిపోయింది. దీంతో ఇంతియాజ్ సిద్దిపేటకు చెందిన గుండెబోయిన నాగలత అలియాస్ లతతో పరిచయమై సహజీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కాజీపేటకు చెందిన లౌడియా కుమారి అలియాస్ రాధిక భర్త కుమార్ అను మహిళ ఇంతియాజ్ భార్య లత ద్వారా పరిచయమవగా, ఇంతియాజ్ కుమారిపై మనసు పడి తన భార్య లతకు తెలియకుండా కుమారితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. అదే చనువుతో కుమారి ఇంతియాజ్ ను లక్ష రూపాయలు ఇవ్వమని అడగగా, ఇస్తానని ఒప్పుకున్నాడు. ఈనెల 5న కుమారి ఇంతియాజ్ కు కాజీపేట దర్గా వద్దకు రమ్మని ఫోన్ చేయగా ఇంతియాజ్ కారు తీసుకెళ్లగా కుమారి లక్ష రూపాయలు ఇవ్వమని డిమాండ్ చేసింది. ఇవ్వకుంటే తమ వివాహేతరసంబంధం తన భార్యతో చెప్తా అనగానే, సరే చెప్పు అని ఇంతియాజ్ అదే కార్లో కుమారిని ఉరుసు కరీంబాద్ కు తీసుకురాగా కుమారి లతతో ఇంతియాజ్ గురించి చెప్పి డబ్బులు ఇవ్వాలని బెదిరించింది. దీంతో లత కుమారితో గొడవపడి కొట్టి నెట్టేయడంతో కుమారి చేతికి గాయాలయ్యాయి. అప్పుడే ఆటోకిరాయి డబ్బులు ఇవ్వడానికి ఇంతియాజ్ ఇంటికి మహేష్, వంశీకృష్ణ రాగా, ఇంతియాజ్, లతలు మహేష్, వంశీలకు కుమారిని ఆటోలో తీసుకువెళ్లి చంపేయండని చెప్పడంతో వారు కుమారినీ ఆటోలో హాస్పటల్ కు తీసుకుపోతామని చెప్పి వెంచర్ లోనికి తీసుకువెళ్లి బండరాయితో కొట్టి చంపేశారు. మృతురాలి భర్త లౌడియ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో మర్డర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన మడికొండ పోలీసులు మృతురాలి బ్యాగ్ లో దొరికిన ఆధార్ కార్డు, వాడిన సెల్ ఫోన్ ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వీరితో పాటు హత్యకు ఉపయోగించినటువంటి ఎస్ క్రాస్ కారు, ఆటో ఇతర మారణాయుధాలు, సెల్ ఫోన్లు సీజ్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించిన మడికొండ పోలీస్ సిబ్బందిని కాజీపేట ఏసీపీ తిరుమల్ అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో మడికొండ సీఐ ప్రతాప్, ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్,కానిస్టేబుల్స్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రామ శ్రీనివాస్ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మోక్షరామం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ సంఘ సేవకుడు, సామాజిక వేత్త, స్వర్గీయ రామ శ్రీనివాస్ 60 వ జయంతి వేడుకలు రామన్నపేటలో వైభవంగా జరిగాయి. నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో మొక్షారామం ఫౌండేషన్ అమ్మ ఒడి భవనంలో రామ శ్రీనివాస్ చిత్ర పటానికి పూల మాల వేసి పుష్పాలు చల్లి నివాళులు అర్పించారు. అనంతరం 3000 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాసాని చంద్రప్రకాష్, కూరపాటి సుదర్శన్, దాసరి ప్రేమ్ సాగర్, డాక్టర్ చందా మల్లయ్య, ప్రముఖ న్యాయవాది వలుసా సుధీర్, చిప్ప వెంకటేశ్వర్లు, 29వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొడకండ్ల సదంత్, బేతి అశోక్, బిట్ల సమ్మయ్య, వడిచర్ల భాస్కర్, ప్రసాద్, రామ్మూర్తి, మోహన్, రాగం సురేష్, పడిశాల రాజు, బైరి అనిల్, గోడిశాల అనిల్, బిట్ల శ్రీనివాస్, శెట్టి రాజేష్, నల్ల సత్యం, గాదె అరుణ, బనుక లలిత, బనుక మాధవి, బిట్ల శ్రీదేవి, రామ మాలతీ, శ్రీలతతో పాటు మోక్షరామం ఫౌండేషన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాంచన-4 అనౌన్స్



తమిళం నుంచి వచ్చిన బ్లాక్ బస్టర్ హారర్ చిత్రాలలో కాంచన ఫ్రాంచైజీ ఒకటి. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు దర్శకుడు రాఘవ లారెన్స్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రాలు సూపర్ హిట్ అందుకున్నాయి. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీలో ముని, కాంచన 2, కాంచన 3 చిత్రాలు వచ్చి మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు తాజాగా ఈ ఫ్రాంచైజీ నుంచి కాంచన 4ను అనౌన్స్ చేశారు రాఘవ లారెన్స్. ఈ సందర్భంగా పోస్టర్‌ను కూడా విడుదల చేశాడు. ఇక రాఘవ లారెన్స్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు. 2025 సమ్మర్‌లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు.



# రామోజీ
## స్ఫూర్తిదాయక వ్యక్తి

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీ రావు ఈరోజు తెల్లవారుజామున 4 గంటల 50 నిముషాలకి కన్నుమూశారు. రామోజీ రావు, ఈనాడు దినపత్రికతోపాటు అనేక రంగాల్లో తన వ్యాపార సంస్థలు విస్తరించారు. స్వతహాగా కళాభిమాని అయిన రామోజీ రావు చిన్నతనంలో వాళ్ళ వూరిలో నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చాలా చురుకుగా పాల్గొనేవారు. అలాగే రామోజీ రావు మంచి సంగీత ప్రియుడు కూడా. రామోజీ గారికి సినిమాలంటే కూడా ఎంతో ఇష్టం. అతను ఒక సినిమాలో నటించారు కూడా. 'మార్పు' అనే సినిమాలో రామోజీ రావు ఒక అతిధి పాత్రలో కనిపించారు. ఈ సినిమా 1978లో వచ్చింది. ఇందులో రామోజీ రావు న్యాయమూర్తి పాత్ర పోషించారు. సినిమాలంటే ఎంతో ఇష్టమున్న రామోజీరావు ఆ తరువాత ఉషాకిరణ్ మూవీస్ సంస్థని ప్రారంభించి, మొదటి సినిమా 'శ్రీవారి ప్రేమలేఖ' తీశారు. సందేశాత్మక, వినోదాత్మక సినిమాలు మాత్రమే తీయాలన్న సంకల్పంతో ఈ సంస్థని ప్రారంభించి అనేక చిత్రాలు తీశారు రామోజీ రావు. మయూరి అనే ఫిలిం డిస్ట్రిబ్యూషన్ ఆఫీసును కూడా మొదలుపెట్టి అనేక చిత్రాలను పంపిణీ చేశారు. ఒక్క తెలుగు చిత్రాలే కాకుండా, పరభాషా చిత్రాలను కూడా తన మయూరి డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా పంపిణీ చేశారు. తన సినిమాల ద్వారా కొన్ని వందలమంది కొత్త తారలను, సాంకేతిక నిపుణలను, కళాకారులను రామోజీ రావు వెండితెరకి పరిచయం చేశారు. అగ్ర నటీమణుల్లో ఒకరైన శ్రియ శరన్ ని రామోజీ రావు పరిచయం చేసిన నటీమణి. 'ఇష్టం' సినిమా ద్వారా శ్రియ శరన్ కథానాయికగా తెలుగు తెరకి పరిచయం అయింది.

### భారతరత్నకు అర్హుడన్న రాజమౌళి


ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీ రావు మృతిపట్ల టాలీవుడ్ దర్శక దిగ్గజం రాజమౌళి సంతాపం తెలిపారు. ఈ నేపథ్యంలో ట్వీట్ ద్వారా నివాళులు అర్పించారు. రామోజీకి భారతరత్న ఇవ్వడం సముచిత గౌరవం అని అన్నారు. ఒక మనిషి అనేక రంగాల్లో వివిధ సంస్థలు స్థాపించి వాటిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాడు. వాటిద్వారా ఎన్నో లక్షలమందికి జీవనోపాధి, ఆశలను అందించి మార్గదర్శకంగా నిలిచారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వడమే సముచితమని రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను అంటూ రాజమౌళి రాసుకోచ్చాడు. దీనిపై అల్లు అర్జున్ రిప్లయ్ ఇస్తూ.. నా మనసులో కూడా అదే భావన కలిగింది సార్. మీరు నా హృదయంతో మాట్లాడారు. దానికి గాత్రదానం చేసినందుకు ధన్యవాదాలు అంటూ బన్నీ తెలిపాడు.



# డబుల్ ఇస్మార్ట్ పూర్తిలో రామ్

టాలీవుడ్ నటుడు ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రస్తుతం ఒక మంచి కంబ్యాక్ కోసం ఎదురుచూస్తున్నాడు. అప్పుడెప్పుడో ఇస్మార్ట్ శంకర్‌తో హిట్ కొట్టిన రామ్‌కి మళ్లీ సరైన హిట్ పడలేదు. ఈ మధ్య బోయపాటి డైరెక్షన్‌లో వచ్చిన స్కంద కూడా బాక్సాఫీస్ వద్ద అట్టర్ ఎ÷-లాప్‌గా నిలిచింది. ఈ సినిమా అనంతరం స్టార్ దర్శకుడు పూరీ జగన్నాథ్‌తో రామ్ డబుల్ ఇస్మార్ట్ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే వరుస ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్నాడు రామ్. ఇప్పటికే హరిశ్ హరీష్ శంకర్‌తో ఒక సినిమా చేయబోతున్న రామ్ మరోవైపు నెట్‌ప్లిక్స్‌తో కలిసి డిజిటల్ ఎంట్రీకి రెడీ అవుతున్నాడు. ఇక ఇవి కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను రామ్ లైన్‌లో పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్‌తో రామ్ సినిమా చేయబోతున్నట్లు తెలుస్తుంది. హరీష్ శంకర్ ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ షూటింగ్‌లో బిజీగా ఉండడంతో ఈ గ్యాప్‌ను రామ్ త్రివిక్రమ్‌తో ప్లాన్ చేయనున్నట్లు తెలుస్తుంది. రామ్ సోంత నిర్మాణ సంస్థ స్రవంతి బ్యానర్ లోనే ఈ ప్రాజెక్టు ఉంటుందని సమాచారం. త్వరలోనే ఈ విషయానికి సంబంధించిన క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.





# విజయ్ దేవరకొండతో సాయిపల్లవి

విజయ్ దేవరకొండతో సాయిపల్లవి స్క్రీన్ షేర్ చేసుకోబోతోంది. సాయిపల్లవి సినిమాల విషయంలో వేగం పెంచింది. ప్రస్తుతం ఆమె తెలుగులో 'తండేల్' చేస్తూనే హిందీలో రెండు భారీ ప్రాజెక్ట్‌లు చేస్తోంది. అలాగే తమిళంలో 'అమరన్'లో నటిస్తోంది. అయితే ఇప్పుడామె కొత్తగా మరో కథ విన్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ హీరోగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. దీన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు. అందమైన ప్రేమకథతో రూరల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానున్న ఈ చిత్రం కోసం నాయికగా సాయిపల్లవిని ఖరారు చేసేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆమెతో కథా చర్చలు పూర్తయ్యాయని.. సినిమా విషయంలో ఆమె సానుకూలంగా ఉందని సమాచారం. దీన్ని వచ్చే ఏడాది సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




# మీడియా దిగ్గజం రామోజీ కన్నుమూత

**రేపు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు**

**సంతాపం తెలిపిన ప్రెస్ క్లబ్, వరంగల్ వాయిస్ యాజమాన్యం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలుగు పత్రికా రంగంలో విప్లవం సృష్టించిన అక్షరం రాలిపోయింది. అనంతలోకాలకు ఎగిపోయింది. మహోన్నత పత్రికా సామ్రాజ్యాన్ని ప్రజలకు అందించిన రామోజీరావు అనంతలోకాలు వెళ్లిపోయారు. శనివారం తెల్లావారు జామున రామోజీరావు అస్తమయం చెందారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆయనను నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. 1936, నవంబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. చిననాటినుంచే విలక్షణ, సృజనాత్మకత కలిగిన ఆయన..1974, ఆగస్టు 10న విశాఖపట్టణంలో ఈనాడు దినపత్రికను ప్రారంభించి సంచలనం సృష్టించారు. అనంతరం సితార సినీ పత్రిక, ఈటీవీ చానళ్లను కూడా తీసుకొచ్చి విరీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫిల్మ్ సిటీని నిర్మించారు. సినిమా మొత్తాన్ని అక్కడే షూటింగ్ చేసుకునేలా సకల వసతులు కల్పించారు. ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్, డిజైనింగ్ ఇంచార్జి వెన్ను రాము, డెస్క్ ఇంచార్జి గోలి రవి, సిబ్బంది సిద్దోడు రాకేష్, పూజారి విజయ్ తదితరులు సంతాపం ప్రకటించారు.

### వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో..

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శనివారం అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎంఎల్‌ఏ కెఆర్.నాగరాజు, ఈనాడు-ఈటీవీ పాత్రికేయులు, పలవురు జర్నలిస్టులు పల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ నాగరాజు మాట్లాడుతూ మీడియా రంగంలో తనకంటూ ప్రత్యేక ఒరవడిని సృష్టించిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. తాను నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్ని అవరోధాలు వచ్చినా ఎదుర్కొని గెలిచి, నిలిచిన వ్యక్తి మరణించటం తెలుగు రాష్ట్రాల ప్రజలకు, యావత్ దేశానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, జర్నలిస్టు సంఘం నేతలు బీఆర్ లెనిన్, తోట సుధాకర్, ఈనాడు పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

### కాకతీయ జర్నలిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో..

జర్నలిజం వృత్తి విలువలకు చివరి శ్వాస వరకు కట్టుబడిన అక్షర యోధుడు, ఈనాడు మీడియా గ్రూప్ అధినేత రామోజీరావు మృతి తెలుగు జర్నలిజానికి తీరనిలోటని కాకతీయ జర్నలిస్ట్ హౌసింగ్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్, కార్యదర్శి సీహెచ్ సోమనరసయ్య శనివారం తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. వృత్తి విలువలు, నిష్పక్షపాతామే వార్తలుగా తెలుగు భాషకు ప్రాధాన్యతనిస్తూ తెలుగు జర్నలిజం రంగంలో విశేష కృషి చేసి క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచిన రామోజీరావు తెలుగు జర్నలిజంలో రోల్ మోడల్ గా నిలిచిపోతారని అభివర్ణించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం కల్పించాలని వారు పేర్కొన్నారు.

### రేపు అంత్యక్రియలు..

రామోజీరావు అంత్యక్రియలను ఆదివారం నిర్వహించనున్నారు. ఆయన మనవడు అమెరికా నుంచి వస్తున్నందున రేపు అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. అధికార లాంఛనాలతో రామోజీరావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రామోజీ ఫిల్మ్ సిటీలో ఆయన భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచారు. ఆయన పార్థివదేహానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నివాళు లర్పించారు.

# మీ అంచనాలు చేరుకోలేక పోయినందుకు.. క్షమించండి

**మద్దతుగా నిలిచిన వారికి ధన్యవాదాలు**

**బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎమ్మెల్సీ ఎన్నికలో నాకు ఓటుతో మద్దతుగా నిలిచిన పట్టభద్రులకు, అండగా నిలిచిన పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మీ అంచనాలు చేరుకోలేకపోయినందుకు క్షమించండి అన్నారు. అందరి అంచనాలకు తగ్గట్టు భవిష్యత్ లో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తానన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటమిపాలైన తర్వాత ఈ మేరకు శనివారం ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి నాకు ఒక గొప్ప అవకాశాన్ని ఇచ్చిన భారత రాష్ట్ర సమితి అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, నాకు అడుగడుగునా అండగా నిలిచిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పెద్దలు హరీష్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు హృదయపూర్వక నమస్సులు అని పేర్కొన్నారు. అలాగే మాజీ మంత్రులు జగదీశ్వర్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, వద్దిరాజు రవిచంద్ర, తాత మధు, వరంగల్, ఖమ్మం, నల్గొండ పరిధిలోగల నియోజకవర్గ ఇంచార్జిలు, జిల్లా అధ్యక్షులు, అతితక్కువ సమయంలో నన్ను గుండెలకు హత్తుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీలకు అతీతంగా నాకు అండగా నిలిచిన ప్రతీ ఒక్కరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. నల్గొండ కేంద్రంగా జరుగుతున్న కౌంటింగ్ కు అన్నీ తానై నడిపించిన ఆత్మీయులు న్న కంచర్ల భూపాల్ రెడ్డి, ఆత్మీయ సోదరుడు నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ సైధి రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్ లో పార్టీ శ్రేయస్సు కోసం, పార్టీ కోసం, ప్రజల కోసం, పట్టభద్రుల కోసం నా శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మీ అందరికీ మాట ఇచ్చినట్టుగా ఎమ్మెల్సీ గా చట్టసభలో నేను అడుగు పెట్టలేకపోయినప్పటికి, ప్రజా సభలో నిత్యం మీ పక్షాన కొట్లాడుతూనే ఉంటానన్నారు. ఈ ఓటమి తాత్కాలికమేనని, భవిష్యత్ గెలుపుకు బాటలు వేస్తూ నిబ్బరంగా సాగుదామని ఏనుగుల రాకేశ్ రెడ్డి పిలుపునిచ్చారు.

### కేసీఆర్‌ను కలిసిన రాకేశ్ రెడ్డి..

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల అనంతరం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గతం కంటే రెట్టింపు ఉత్సాహంతో పని చెయాలని కేసీఆర్ సూచించారు. పార్టీ ప్రతికూల వాతావరణంలో సైతం కాంగ్రెస్ పార్టీకి చుక్కలు చూపించారని, ఇదే స్ఫూర్తితో నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు.

# 13నుంచి జర్నలిస్ట్ క్రీడలు

**అదే రోజు ఉదయం ఆర్ట్స్ కళాశాల వరకు 3కే రన్**

**గ్రూప్-1 కారణంగా వాయిదా**

**ప్రకటించిన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులకు నిర్వహించనున్న క్రీడా పోటీలను ఈనెల 13నుంచి నిర్వహించనున్నట్లు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ ప్రకటించింది. రేపటినుంచి ఈ క్రీడలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ గ్రూప్-1 పోటీ పరీక్ష కారణంగా ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ ను ఇవ్వలేకపోతున్నామని, ఇంటర్నల్ కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల జరుగుతున్న ఇబ్బందిని అర్థం చేసుకోవాలంటూ కళాశాల యాజమాన్యం కోరడంతో క్రీడలను వాయిదా వేయక తప్పలేదని అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ తోపాటు కమిటీ తెలిపింది. ఈనెల 13 వ తేదీ గురువారం ఉదయం 6 గంటలకు 3కే రన్ ను ప్రెస్ క్లబ్ నుంచి ఆర్ట్స్ కళాశాల ఆవరణ వరకు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అదే రోజునుంచి వరుసగా గేమ్స్ నిర్వహిస్తామన్నారు. అయితే క్రీడా పోటీల్లో పాల్గొనే జట్ల జాబితాను సోమవారం క్లబ్ లోని నోటీస్ బోర్డుపై డిస్ ప్లే చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరికీ ఏ సమాచారం కావాలన్న ఆయా గేమ్స్ కు సంబంధించి క్లబ్ బాధ్యులతో వేసిన కమిటీలను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. డెస్క్ మిత్రుల కోసం ప్రత్యేకంగా డెస్క్ తో సంబంధాలు కలిగిన క్లబ్ బాధ్యులు అల్లం రాజేష్ వర్మ, బూర్ల నరెందర్ లను సంప్రదించాలని సూచించారు. క్రీడా నిర్వహణ తేదీల విషయంలో ఎదురౌతున్న ఇబ్బందులను సహృదయంతో అర్థం చేసుకోవాలని విన్నవించారు.



# ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న

**అభినందించిన నేతలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు అభినందనలు వెల్లువెత్తాయి. గట్టి పోటీనిచ్చిన బీఆర్ ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి చివరి నిమిషంలో ఎలిమినేట్ కావడంతో తీన్మార్ మల్లన్న విజయం సాధించినట్లు ప్రకటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం పొందిన తీన్మార్ మల్లన్నను కౌంటింగ్ కేంద్రం వద్ద ఓయూ, కేయూ విద్యార్థీ నాయకులతో భారీ ఎత్తున తరలివెళ్లిన తెలంగాణ విద్యార్థీ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్, కన్వీనర్ మేడారపు సుధాకర్, జనరల్ సెక్రటరీ తాళ్లపల్లి నరేష్, ముఖ్య నాయకులు ఎల్తూరి రవీందర్ రావు, నాగరాజు, హేమంత్, సాయిరాం, మధు తదితరులు అభినందనలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com